క్లుప్తంగా

ప్రైవేటీకరణను నిరసిస్తూ సంతకాల సేకరణ

లబ్బీపేట(విజయవాడ తూర్పు): నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుంది. ప్రభుత్వ వైద్యాన్ని ప్రైవేటు పరం చేయడాన్ని అన్ని వర్గాల ప్రజలు నిరసిస్తున్నారు. సెంట్రల్ నియోజకవర్గంలోని 24వ డివిజన్‌లో కార్పొరేటర్ కుక్కల అనిత ఆధ్వర్యంలో మంగళవారం సీతారామపురం ప్రాంతంలో సంతకాల సేకరణ చేపట్టారు. వైద్య కళాశాలలు ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ సంతకాలు సేకరిస్తున్నట్లు ప్రజలకు వివరిస్తున్నారు. ఈ అంశంపై ప్రతి ఒక్కరూ తమ మద్దతు తెలుపుతున్నారు.

డ్రోన్ సహాయంతో అవుట్ ఫాల్ డ్రెయిన్ పరిశీలన



పటమట(విజయవాడ తూర్పు): నగరంలోని కెనాల్స్, అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో వ్యర్థాల గుర్తింపునకు డ్రోన్‌లు వినియోగించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం అజిత్ సింగ్‌నగర్ రైల్వే ట్రాక్ రోడ్, జేఎన్ఎన్ఆర్‌యూఎం(జవహర్ లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్) ఇళ్లు, ఎక్సెల్ ప్లాంట్, వాంబే కాలనీ, డిస్నీ ల్యాండ్ రోడ్ ప్రాంతాలలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన అజిత్ సింగ్‌నగర్ రైల్వే ట్రాక్ రోడ్డు వద్ద గల అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను డ్రోన్ ద్వారా పరిశీలించి అందులోని వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. పర్యటనలో ఇన్‌చార్జి పర్యవేక్షణ ఇంజినీర్(వర్క్స్) శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



పటమట(విజయవాడ తూర్పు): అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అక్కడున్న వారంతా అప్రమత్తంగా ఉండాలని.. అధైర్యపడకుండా మంటలను అదుపులోకి తీసుకునే నైపుణ్యాలను నేర్చుకోవాలని వీఎంసీ స్టేషన్‌ఫైర్ అధికారి నరేష్ అన్నారు. వీఎంసీ అగ్ని ప్రమాద నిరోధక విభాగం ఆధ్వర్యంలో ప్రమాదాల సమయంలో తీసుకునే చర్యలపై బందరు రోడ్డులోని సీఎంఆర్ షాపింగ్ కాంప్లెక్, అభయ ఆస్పత్రి సిబ్బందికి మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించే విధానం, ప్రమాదం జరిగినప్పుడు మంటలను అదుపు చేసే నైపుణ్యం, నిరోధక పరికరాలను వినియోగించే విధానం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మల్యాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

భవానీపురం(విజయవాడ పశ్చిమ): కార్డియాక్ పల్మనరీ రీసక్సినేషన్ (సీపీఆర్)పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సీపీఆర్ ప్రోగ్రామ్ లయన్స్ క్లబ్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ దేవతి నాగేశ్వరరావు అన్నారు. సీపీఆర్ వారోత్సవాల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడిక ఆధ్వర్యంలో గొల్లపూడిలోని అట్కిన్‌సన్ పాఠశాలలో మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. సీపీఆర్ ప్రాథమిక చికిత్స వల్ల వ్యక్తి ప్రాణాన్ని కాపాడిన వాళ్లం అవుతామని వివరించారు. సీపీఆర్ విధానంపై డాక్టర్ కోలా విజయశేఖర్ డెమో ఇచ్చి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని సీపీఆర్ ద్వారా రక్షించవచ్చని పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి పొన్నూరు హరినాథ్ ప్రసాద్, పువ్వాడ లక్ష్మీ శ్రీనివాస్, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. బుధవారం సాయంత్రం 5 గంటలకు భవానీపురం బ్యాంక్ సెంటర్‌లోని ఆలైటీ నర్సింగ్ హోమ్‌లో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): వివాహితను వేధింపులకు గురిచేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం .. వించిపేట మధిర వారి వీధికి చెందిన యువకుడు బాధితురాలు 2021లో ప్రేమ వివాహం చేసుకున్నారు. కొంత కాలంగా భర్తతో పాటు అత్త, మామ, బావ మానసిక, శారీరకంగా వేదింపులకు గురి చేస్తున్నారని బాధితురాలు వాపోయారు. గతంలో ఒకసారి విడాకులు కావాలని భర్త బాధితురాలిని కొట్టి ఇంటి నుంచి పంపగా పెద్దల సమక్షంలో మాట్లాడుకున్నారు. భర్త తీరులో మార్పురాకపోగా వేధింపులు అధికమవ్వడంతో పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాబు బినామీలకు కట్టబెట్టేందుకే ప్రైవేటీకరణ

- వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ



64వ డివిజన్లో సంతకాలు చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



అయోధ్యనగర్‌లో సంతకాల సేకరణ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



సింగ్‌నగర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, నాయకులు



ప్రకాష్‌నగర్ సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో సంతకాలు సేకరిస్తున్న రవిచంద్ర

పాయకాపురం(విజయవాడ రూరల్): చంద్రబాబు బినామీలకు వైద్య కళాశాలలను కట్టబెట్టేందుకు ప్రైవేటీకరణ చేపట్టారని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. రాష్ట్రంలోని వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మంగళవారం 64వ డివిజన్‌లో జరిగింది. స్థానిక కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మతో కలిసి మల్లాది విష్ణు డివిజన్లో ర్యాలీగా ఇంటింటికీవెళ్లి సంతకాలను సేకరించారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం వలన జరిగే నష్టాన్ని ఆయన ప్రజలకు వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత 5 సంవత్సరాల కాలంలో విద్యకు ప్రాధాన్యతనిస్తూ 70 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేశారని, కేంద్రం నుంచి 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేయించి నిర్మాణాలు చేశారన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాలు మెడికల్ కళాశాలల కోసం పోటీ పడుతుంటే మన రాష్ట్రంలో చంద్రబాబు, పరిపాలన చేతకాక ప్రైవేటు వ్యక్తులకు కట్టపెట్టేందుకు ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే విద్యార్థులకు, ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండదన్నారు. పీపీపీ విధానం వల్ల అనేక సమస్యలను ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని, పాడేరులో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితితులను మెరుగుపర్చేందుకు విశాఖలో జీజీహెచ్ ఆసుపత్రికి తీసుకురావాల్సి వచ్చిందని, విజయవాడ రాజరాజేశ్వరిపేట, గుంటూరులో జరిగిన పరిణామాలను ఆయన వివరించారు. ఇప్పటికైనా చంద్రబాబు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విరమించుకోవాలని, లేని ఎడల రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఉద్యమాలను ఉధృతం చేస్తామని విష్ణు హెచ్చరించారు. సంతకాల సేకరణకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు యర్రగొర్ల శ్రీరాములు, జె.శివ, షేక్ ఇస్మాయిల్, కొక్కిలిగడ్డ నాని, అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు. 63వ డివిజన్లో డివిజన్ ప్రెసిడెంట్ పసుపులేటి యేసు ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ జరిగింది. 62వ డివిజన్లో పార్టీ నాయకులు అలంపూర్ విజయ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. 61వ డివిజన్లో డివిజన్ ప్రెసిడెంట్ నాలం బాబు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ జరిగింది. కార్యక్రమంలో ఆర్‌ఎస్ నాయుడు, డి.కళ్యాణి, వెంకటలక్ష్మి, వెంకటేశ్వరరావు, నబీ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కాపాడుకోవాలి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ వైద్య రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్రంలో అందరిపై ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుండె సుందర్‌పాల్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 32వ డివిజన్ వైఎస్సార్ సీపీ నేతలు మంగళవారం అయోధ్యనగర్‌లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. సుందర్‌పాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసి పేదలకు సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు అందించే దిశగా రాష్ట్రవ్యాప్తంగా రూ.8,450 కోట్లతో మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారని, అందులో ఐదు కాలేజీలు ప్రారంభం అయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జగన్‌మోహన్‌రెడ్డికి ఎక్కడ పేరు ప్రఖ్యాతలు ఇస్తాయోనని ప్రస్తుత కూటమి ప్రభుత్వం భావించి మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసి ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఇంటింటికీ తిరిగి సంతకాల సేకరణ చేపట్టారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఒగ్గు గవస్కర్, త్రివేణిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సుజాత, సువర్ణరాజు, లత, రవి, జగన్‌మోహన్‌రెడ్డి, ఆనంద్, పెద్దిరాజు, వసంత తదితరులు పాల్గొన్నారు.

33వ డివిజన్‌లో...

వైఎస్సార్ సీపీ 33వ డివిజన్ ఇన్‌చార్జ్ దోనేపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. స్థానికులచే సంతకాల సేకరణ చేపట్టారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో..

పాయకాపురం(విజయవాడరూరల్): వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకునేంత వరకు కూటమి ప్రభుత్వంపై ఉద్యమిస్తామని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర స్పష్టం చేశారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు జరుగుతున్న కోటి సంతకాల సేకరణలో భాగంగా మంగళవారం పాయకాపురం ప్రకాష్‌నగర్‌లో సాంఘిక సంక్షేమ కళాశాల వసతి గృహంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ జరిగింది. విద్యార్థులు స్వచ్ఛందంగా సంతకాలు చేసి కూటమి ప్రభుత్వ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని నిరసించారు. రవిచంద్ర మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల ప్రాంతాల్లో వైద్య కళాశాలలు పూర్తి చేసి తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. చంద్రబాబు ఒక్క మెడికల్ కాలేజిని తీసుకురాగ పోగా, ప్రస్తుతం మెడికల్ కళాశాలలను తన బినామీలకు దోచిపెట్టేందుకు ప్రైవేటీకరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సురేష్, 62వ డివిజన్ పార్టీ నాయకులు అలంపూర్ విజయ్ కుమార్, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.మహేష్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కే మస్తాన్, నాయకులు సీహెచ్. రామిరెడ్డి, విద్యార్థి విభాగం నాయకులు ఆనంద్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగే వరకూ..

– ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సామాన్యులకు ఉన్నత చదువులు అందకుండా చేయాలని చూస్తున్న ఈ కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగే వరకూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లో మంగళవారం జరిగింది. అనంతరం కోటి సంతకాల సేకరణ పోస్టరును ఆవిష్కరించారు. వైస్సార్ సీపీ ఎండీ హాఫీజుల్లా, ఎండీ షఫీ, మామిడాల నాగేశ్వరరావు, చల్లగాలి రమేష్, అనిల్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు. స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలో 'కోటి సంతకాల సేకరణ' కార్యక్రమంలో మల్లాది విష్ణు పాల్గొన్నారు. కార్పొరేటర్ ఇసరపు దేవి, వైఎస్సార్ సీపీ నాయకులు భోగాది మురళి, ఇసరపు రాజు, ఆదినారాయణ, పఠాన్ నజీర్‌ఖాన్, కృష్ణారెడ్డి, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 26వ డివిజన్ చుట్టుగుంటలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ క్లస్టర్-1 ఇన్‌చార్జి పీ వంశీ మాట్లాడుతూ తాము తలపెట్టిన కోటి సంతకాల సేకరణకు విశేష స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కె.నాగాంజనేయులు, పీ కోటేశ్వరరావు, ఎన్.సోమాజీ, రమణ, భవాని తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో రాష్ట్రంలో ప్రారంభించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించటం పట్ల 30వ డివిజన్ కార్పొరేటర్ బీ హెచ్ఎస్‌వీ జానారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక 30వ డివిజన్ దేవీనగర్‌లో మంగళవారం ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సంతకాలను సేకరించారు. ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేసిన మోసాన్ని వివరిస్తూ ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా స్థానికులు కూటమి ప్రభుత్వంలో పనులు లేక అవస్థలు పడుతున్నామని.. వైద్యకళాశాలలను ప్రైవేటీకరణ చేయటం వల్ల వైద్య సేవలకు దూరం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు దుర్గారావు, రామకృష్ణ, శ్రీరాములు, నారాయణరెడ్డి, రఫీ, రాజారత్నం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



దేవీనగర్‌లో సంతకాలు సేకరిస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి, తదితరులు

27వ డివిజన్‌లో..

27వ డివిజన్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అధ్యక్షతన జరిగింది. ఆమె సంతకాలు సేకరించారు. వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు కురిటి శివ, నాయకులు శీలం భవానీరెడ్డి, వీబీ ఆచారి, కె.రవివర్మ, దుర్గారావు, అంజి, కుమార్, మండా రాము తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణకు విశేష స్పందన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణకు విశేష స్పందన లభించింది. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు సెంట్రల్ నియోజకవర్గ ఇంచార్జి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో సంతకాల సేకరణ ప్రారంభమైంది. 64వ డివిజన్‌లో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సంతకాల సేకరణను ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి 58వ డివిజన్ నందమూరి నగర్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలు స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీ ఏర్పాటు చేసిన శిబిరాల వద్దకు వచ్చి ఫారాలపై సంతకాలు చేసి కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో పార్టీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, విద్యార్థివిభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ రవిచంద్ర, కార్పొరేటర్లు తిరుపతమ్మ, ఈసరపు దేవి, మల్లేశ్వరి, పార్టీ క్లస్టర్ అధ్యక్షులు , అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.



బస్సులో ప్రయాణికుల నుంచి సంతకాలు సేకరిస్తున్న డెప్యూటీ మేయర్ శ్రీశైలజారెడ్డి

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగ కమిటీల నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన పలువురిని జిల్లా పార్టీ అనుబంధ విభాగాల్లో నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

- బీసీ సెల్ కమిటీ ఉపాధ్యక్షుడిగా సువ్వాడ మనోహర్, ప్రధాన కార్యదర్శిగా మండల రమేష్‌బాబు, కార్యదర్శిగా కొంగితల శివ, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కె.గణేష్
- జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షులుగా దాసం నాగప్రియ, కార్యదర్శి ఎం.పుష్పలత, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వీర్ల వరలక్ష్మి, బొమ్మిడి మాధవి.
- జిల్లా ఎస్సీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా పరాసు అబ్రహం, మేశం చిన్నా, కార్యదర్శులుగా నగరి ప్రసాద్, మన్నం అశోక్‌కుమార్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్ అవిటి గంగాధర్..
- లీగల్ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా ఆసపు ఈశ్వరరావు, ఎంఎస్ఎన్ రెడ్డి, కార్యదర్శిగా కె.రమణరావు, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా చిరిగుడి ఆదాం, ఈ ఉషాజ్యోతి, కొటారి ఉత్తమ్‌లు నియమితులయ్యారు.
- సెంట్రల్ నియోజకవర్గ క్లస్టర్-1 యూత్ వింగ్ ప్రెసిడెంట్‌గా కొమ్ము ఇమ్మానుయేల్, క్లస్టర్- 2 ఇల్లవాల ఆంజనేయులు, క్లస్టర్-3 మెండదాల గోపి కృష్ణ, క్లస్టర్ మహిళ విభాగం అధ్యక్షులుగా క్లస్టర్-1కు కలకలేటి రమణి, క్లస్టర్ -2 వడ్లాని పూర్ణిమ లత, క్లస్టర్ -3 వేము హైమావతి నియమితులయ్యారు.

వృక్షశాస్త్ర విభాగాధిపతి స్వప్నకు అవార్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గడల స్వప్నకు సొలైట్ ఇంటర్నేషనల్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బెస్ట్ టీచర్ అవార్డు లభించిన సందర్భంగా మంగళవారం కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. నగరంలో ఇటీవల జరిగిన అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో డాక్టర్ గడల స్వప్నకు అవార్డు, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించారు. ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ విజయభాస్కర్, ఇగ్నో విజయవాడ రీజనల్ డైరెక్టర్ కె.సుమలత, ప్రొఫెసర్ డాక్టర్ ఏ పూర్ణ చంద్రనాగరాజు తదితరుల చేతలమీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ నేపథ్యంలో కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గడల స్వప్నను కళాశాల అధ్యాపకులు సిబ్బందితో కలిసి అభినందించారు. గత 14 సంవత్సరాలుగా వృక్షశాస్త్ర విభాగంలో ఆమె అందించిన సేవలకు గుర్తింపు ఈ పురస్కారం అందిందని కొనియాడారు. తమ కళాశాల అధ్యాపకురాలికి ప్రతిష్టాత్మక పురస్కారం రావటం గర్వకారణంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డాక్టర్ గడల స్వప్నను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి

స్వచ్ఛత పఖ్వాడలో డివిజన్ ఉద్యోగుల కృషి అభినందనీయం

డీఆర్‌ఎం మోహిత్ సోనాకియా

రైల్వేస్టేషన్(విజయవాడ సెంట్రల్): విజయవాడ డివిజన్‌లో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు విజయవంతం చేయడంలో అధికారులు, ఉద్యోగుల కృషి అభినందనీయమని డీఆర్‌ఎం మోహిత్ సోనాకియా పేర్కొన్నారు. మంగళవారం డీఆర్‌ఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఉద్యోగులకు ప్రశంసా పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. డివిజన్ వ్యాప్తంగా స్వచ్ఛత పఖ్వాడ కార్యక్రమంలో భాగంగా రైల్వేస్టేషన్, కార్యాలయాలు, కాలనీలలో పరిశుభ్రతను పెంచడంలో కృషిచేశారని కొనియాడారు. పరిశుభ్రత, వ్యర్థాల నిర్వాహణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణలో ప్రయాణికులు, ప్రజలకు అవగాహన కల్పించడంలో సిబ్బంది అవలంబించిన వినూత్య ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు. డివిజన్‌లో పరిశుభ్రతను ప్రచార కార్యక్రమంగా కాకుండా రోజువారి సంస్కృతిలో భాగం చేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం స్వచ్ఛ రైలు-స్వచ్ఛ భారత్ స్ఫూర్తిని ప్రదర్శించిన అధికారులు, సిబ్బందిని డీఆర్‌ఎం ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. పి.ఇ.ఎడ్విన్, పలు బ్రాంచ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న డీఆర్‌ఎం మోహిత్ సోనాకియా

జీఎస్టీపై అవగాహనా ర్యాలీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): జీఎస్టీ 2.0 తగ్గింపు వల్ల కొన్ని వస్తు సేవల ధరలు తగ్గాయని, విద్యార్థులు జీఎస్టీ 2.0 పై అవగాహన పెంచుకోవటంతో పాటు కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారికి తెలియజేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జీఎస్టీ 2.0పై అవగాహన కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఆమె ముఖ్యఅతిథిగా అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఏవస్తువులపై ఎంత ధరలు తగ్గాయో తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని ఏలూరు రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు.అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్విజ్‌లో ఈఎన్‌టీ పీజీ ప్రతిభ

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ విజయవాడలో జరిగిన ఈఎన్‌టీ వైద్యుల దక్షిత భారత సదస్సులో సిద్ధార్థ వైద్య కళాశాలకు చెందిన ఈఎన్‌టీ విభాగం పీజీ డాక్టర్ ముకుందన్ క్విజ్‌లో రజత పతకం గెలుపొందారు. ఈ సందర్భంగా ముకుందన్‌తో పాటు, ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ కె.రవిని మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు అభినందించారు.

రచనలతో చైతన్యం చేయడం అభినందనీయం

– గిరిజన గీత శిల్పి బొండా జగన్‌మోహన్‌రావు



భవానీపురం(విజయవాడ పశ్చిమ): రచనల ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్న అబ్దుల్ రజా హుస్సేన్ అభినందనీయులని గిరిజన గీత శిల్పి డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావు ప్రశంసించారు. ప్రముఖ రచయిత, జర్నలిస్ట్ అబ్దుల్ రజా హుస్సేన్ మంగళవారం భవానీపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని బొండా ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. ఈ సందర్భంగా తాను చిత్రించిన రజా హుస్సేన్ కాన్వాస్‌ను జగన్‌మోహన్‌రావు ఆయనకు బహూకరించి శాలువాతో సత్కరించారు. అనంతరం బొండా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. రచయిత, జర్నలిస్ట్‌గా ప్రజా సమస్యలపై రజా హుస్సేన్ చేసిన పలు సేవలను కొనియాడారు. సత్కార గ్రహీత రజా హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రతిభను గుర్తించి, గౌరవించడంలో బొండా జగన్‌మోహన్‌రావు ముందుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిత్రకారులు పి.చంద్రశేఖర్, ఉదయ్ శంకర్ చల్లా, వై.కళాసాగర్, రచయిత గోలి మధు తదితరులు పాల్గొన్నారు.

కీలక ప్రగతి సూచికల లక్ష్య సాధనలో అలసత్వం వద్దు

జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కీలక ప్రగతి సూచికల (కేపీఐ) లక్ష్యాల సాధనకు ప్రతి శాఖ కృషి చేయాలని, ఇందుకు సరైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కీలక ప్రగతి సూచికలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ కేపీఐల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్‌లో అప్‌డేట్ చేయాలని చెప్పారు. వార్షిక తలసరి ఆదాయ వృద్ధితో పాటు వృద్ధిరేటు 18 శాతం ఉండాలన్న లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. వార్షిక రుణ ప్రణాళికలకు అనుగుణంగా రైతులు, కౌలు రైతులకు రుణాలు మంజూరు లక్ష్యాలను చేరుకోవాలన్నారు. జిల్లాలో ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని చెప్పారు. మత్స్య రంగ విస్తరణపై దృష్టి సారించాలన్నారు. సహకార సంఘాల పురోగతిని తెలియజేయాలన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి గోనె సంచులు నేరుగా రైతుకు చేరేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రతి మంగళవారం కీలక ప్రగతి సూచికలపై సమావేశం నిర్వహిస్తామని, జిల్లా అధికారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. సీపీవో వై.శ్రీలత, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

● కనీస వసతులు కల్పించండి సారూ!



విజయవాడ 64వ డివిజన్ కండ్రికలో అంగన్‌వాడీ కేంద్రం ప్రహరీ కూలిపోయింది. దీంతో మందుబాబులకు అడ్డాగా మారింది. అంగన్‌వాడీ భవనం చుట్టూ ఖాళీ మద్యం బాటిళ్లు కనిపిస్తున్నాయి. ఈ కేంద్రానికి వచ్చే చిన్నారులు, తల్లిదండ్రులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్, విజయవాడ